పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ తదితరులు

చందానగర్ : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్ కలిసి కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహా స్వామిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గాంధీకి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం, స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

నేడు 'మనూ' ఐటీఐలో ప్రవేశాలు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయం ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి గురువారం అవకాశం కల్పిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ డాక్టర్ అర్షియా ఆజమ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడ్‌ల్లో ఖాళీగా ఉన్న సీట్లకు రెండో దశ అడ్మిషన్ కౌన్సెలింగ్ కోసం మధ్యాహ్నం 12.30 గంటల వరకు అవకాశం ఉందని దరఖాస్తులను యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. కౌన్సెలింగ్‌ను మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐటీఐ క్యాంపస్‌లో మొదలవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ధ్రువీకరణ కోసం అవసరమైన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, కాపీలను తీసుకురావాలని సూచించారు.

హెచ్‌సీయూలో నిరసనలు



హెచ్‌సీయూలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, టీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం రాత్రి నిరసన చేపట్టారు. అనంతరం ఏబీవీపీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల దిష్టిబొమ్మను దహనం చేసి వాటికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన విద్యార్థిని జేఎన్‌యూలో దాడి చేసిన కేసులో ఇప్పటివరకు ఎలాంటి పురోగతి సాధించకపోవడానికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు.

నిలిచిన ఆర్టీఏ సేవలు

మణికొండ: రవాణా శాఖ సాఫ్ట్‌వేర్ సమస్యలతో బుధవారం ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. మణికొండలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఉదయం నుంచే సర్వర్ సమస్య రావడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2 గంటల పాటు వాహన మిత్ర సాఫ్ట్‌వేర్‌ను బాగు చేసేందుకు ప్రయత్నించిన అధికారులు అది రాష్ట్రవ్యాప్త సమస్యగా తెలుసుకుని మిన్నకున్నారు. కార్యాలయం ఎదుట సాఫ్ట్‌వేర్ సమస్య వలన ఈ రోజు కార్యకలాపాలు నిలిపేశామని ఓ బోర్డును ఏర్పాటు చేశారు. దాంతో చేసేది లేక పనుల కోసం వచ్చిన ప్రజలు తిరిగి వెళ్లిపోయారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మణికొండ: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ మండలం, రాందేవ్‌గూడకు చెందిన ఎంటీ రాములు (55) ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పని చేసేవాడు. ఇటీవల అప్పులు ఎక్కువగా కావడంతో ఇచ్చిన వారు డబ్బులు అడుగుతున్నారు. దీంతో పాటు మంగళవారం రాత్రి భార్యతో గొడవ జరిగింది. అనంతరం ఇంట్లో నుంచి బైక్‌పై వెళ్లి మంచిరేవుల సమీపంలోని వేణుగోపాలా స్వామి ఆలయ సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. ఉదయం అటుగా వెళ్లిన వారు చూసి పోలీసులకు, భార్యకు సమాచారం ఇచ్చారు. భార్య ఉమారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరమ్మతులు చేయించి.. రంగులు వేయించి..!

- ఆదర్శంగా నిలిచిన టీచర్లు, అధ్యాపకులు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్
- మారిన గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల/పాఠశాల రూపురేఖలు
- 10 రోజుల్లోనే క్యాంపస్‌కు నూతన శోభ

అది శేరిలింగంపల్లి గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల/పాఠశాల రాష్ట్రంలో అత్యధిక ఎంబీబీఎస్, ఐఐటీ, ఎన్ఐటీ సాట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచిన విద్యా సంస్థ. అలాంటిది మరో అంశంలో కూడా ఆదర్శంగా నిలిచింది. సదరు గురుకుల టీచర్లు, లెక్చరర్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ వారు పని చేసే విద్యాసంస్థ భవనాలకు నూతన శోభను తీసుకురావాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా పనుల వ్యయాన్ని తామే భరించాలని తలపెట్టి ఈ విషయాన్ని కళాశాల/పాఠశాల ప్రిన్సిపాల్ అంజయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా సమ్మతించి తాను కూడా భాగస్వామ్యం అవుతానని హామీనిచ్చారు. కేవలం 10 రోజుల్లోనే క్యాంపస్‌లోని పరిపాలనా భవనం, ప్రిన్సిపాల్ చాంబర్, తరగతి గదులు, డైనింగ్ హాల్, కిచెన్ వాటికి మరమ్మతులు చేయించి రంగులు వేయించారు. దీంతో క్యాంపస్‌కే కొత్త కళ వచ్చినట్లయ్యింది. టీచర్లు, లెక్చరర్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ అంతా సమష్టిగా పని చేయడంతోనే ఇది సాధ్యమైందని ప్రిన్సిపాల్ అంజయ్య తెలిపారు. భవిష్యత్తులో ఎంబీబీఎస్, ఎన్ఐటీ, ఐఐటీ సీట్ల సాధనలోనూ మరింత ముందుండేలా ప్రణాళికలు రూపొందించి ముందుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

-రాయదుర్గం



నాడు నేడు

గురుకుల బాలుర కళాశాల/పాఠశాల పరిపాలనా భవనం



వంటశాల, నాడు నేడు



తరగతి గదులు నాడు, నేడు

సీడీఓఈ యూట్యూబ్ చానల్ ప్రారంభం

రాయదుర్గం: గచ్చిబౌలి ఉర్దూ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) అధికారిక యూట్యూబ్ చానల్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)–'మనూ' మధ్య ఒప్పందం కుదుర్చుకుని రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ.. 2 సంస్థలు తమ ఉమ్మడి లక్ష్యాలను సాధించగలవని ధీమా వ్యక్తం చేశారు. ఎన్ఐఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ అఖిలేష్‌మిశ్రా మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాల ప్రజలను విద్యాప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, సీడీఓఈ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల అధికారులు

డైరెక్టర్ ప్రొఫెసర్ మహమద్ రజావుల్లాఖాన్, ఎన్ఐఓఎస్ కార్యదర్శి కల్నల్ షకీల్ అహ్మద్, సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అబ్దుల్‌సమీ సిద్ధిఖీ, డాక్టర్ షేక్ వసీం, స్టూడెంట్ సపోర్ట్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అందుబాటులో లేని ఎస్‌బీఐ సేవలు



పని చేయని ఎస్‌బీఐ ఏటీఎం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం పని చేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వినియోగదారులు అవసరాల కోసం ఏటీఎం నుంచి డబ్బులు తీసుకునేందుకు వస్తుంటారు. ఏటీఎం పనిచేయకపోవడంతో అసహనానికి గురవుతున్నారు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. మండలంలో ఎస్‌బీఐ బ్యాంకును ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా ఖాతాదారులు అధికారులకు విన్నవించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి మండలంగా ఉన్నప్పుడు గుమ్మడిదలలో బ్యాంక్ ఏర్పాటు చేశారు. గుమ్మడిదల మండలంగా ఏర్పాటైన తరువాత జిన్నారంలో బ్యాంక్ సేవలు దూరమయ్యాయి. గుమ్మడిదల, అన్నారంలో కూడా బ్యాంక్ ఉంది, కానీ జిన్నారం 15 గ్రామాలకు ఒక్క బ్యాంక్ లేకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిన్నారంలో ఎస్‌బీఐ శాఖను ఏర్పాటు చేసి ఖాతాదారుల సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం బొల్లారం పట్టణ పరిధిలోని గాంధీనగర్ రామమందిరంలో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మికత భక్తిభావం పెంపొందించేలా నిర్వహిస్తున్న రామ్ మందిర్ ట్రస్ట్ కార్యక్రమాలను అభినందించారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో స్థానిక నాయకులు

ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దాతలు లతాశ్రీ కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చంద్రారెడ్డి, వేణుపాల్ రెడ్డి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఐదుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ.వెయ్యి, మరో వ్యక్తికి రూ.3 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కారు డ్రైవర్ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం... రామచంద్రపురం పరిధిలోని ఈదురు నాగులపల్లికి చెందిన చాకలి సామ్యూల్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరికి సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే ఎంపిక



డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై ఏఐసీసీ పరిశీలకురాలు సిజరిట

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్యకర్తల అభీష్టం మేరకే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకురాలు సిజరిట స్పష్టం చేశారు. రామచంద్రాపురం పట్టణంలో నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల, బ్లాక్, గ్రామస్థాయి కార్యకర్తల అభిప్రాయాల సేకరించి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, రాష్ట్ర సీనియర్ నాయకులు నీలం మధు, గాలి అనిల్ కుమార్, శశికళ, చిన్న ముదిరాజ్, జిల్లా నాయకులు మహీన్ గౌడ్, అరుణ్ గౌడ్, శ్యామ్‌రావు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో. టమాట రూ. 30, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 30, చామ 40, కీర 35, బీర 50, వంకాయ 50, గోకర 80, బీన్స్ 80, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 50, సొరకాయ (కేజీ) 30, అల్లం 110, వెల్లుల్లి 150.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గచ్చిబౌలి: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జయభేరి ఎన్‌క్లేవ్ డీఎల్ఎఫ్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి(35-40) మృతి చెంది ఉన్నట్లు బుధవారం ఉదయం స్థానికులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మంగళవారం రాత్రి మరణించి ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. సంబంధిత వ్యక్తులు ఉంటే గచ్చిబౌలి పీఎస్ లేదా 9490617127 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం



విద్యార్థులు

మాదాపూర్: ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. మేడిశెట్టి శ్యామ్ సూర్య వెంకటేశ్ (14) మాదాపూర్‌లోని గ్రీన్‌ఫీల్డ్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 14న 4.30 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వచ్చాడు. ట్యూషన్‌కు వెళ్తున్నానని కుటుంబ సభ్యులతో చెప్పి సాయంత్రం 5 గంటలకు స్కూల్ బ్యాగ్‌లో డ్రెసులు పెట్టుకుని వెళ్లాడు. తన స్నేహితుడు మాస్టర్ రామేశ్వరం సాయి స్వదీప్ (14) కూడా 9వ తరగతి చదువుతున్నాడు. అతని తల్లిదండ్రులను అడుగగా తన కుమారుడు కూడా ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు బదులిచ్చారు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలాం జీవితం స్ఫూర్తిదాయకం

పటాన్‌చెరు: అత్యంత సామాన్య కుటుంబం నుంచి జీవితాన్ని ప్రారంభించి.. దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవి చేపట్టడంతోపాటు రక్షణ రంగంలో మిస్సైల్ మెన్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని అబ్దుల్ కలాం విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ..అబ్దుల్ కలాం ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రత్యేకంగా కేజీ టు పీజీ విద్యా ప్రాంగణంలోనే ఆయన కాంస్య విగ్రహాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించరూ..!

శేరిలింగంపల్లి: డివిజన్‌లోని నల్లగండ్ల కూరగాయల మార్కెట్ ఎదుట గల ప్రధాన రోడ్డు పక్కనే వరద నీటి కాలువల నుంచి తొలగించిన పూడిక, ఇతర వ్యర్థాలు రెండు నెలలుగా పేరుకుపోయాయి. అయినా సంబంధిత అధికారులు వాటిని తరలించడం లేదని స్థానికులు వాపోతున్నారు. తీసిన పూడికను తొలగించాల్సిన కాంట్రాక్టర్లు వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారని వెంటనే పూడికను తొలగించేలా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు



నల్లగండ్ల కూరగాయల మార్కెట్ ఎదుట ప్రధాన రోడ్డుపై మట్టి కుప్పలు

చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. డిమాండ్ చేస్తున్నారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత



పందులు పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ వ్యాప్తంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో పందుల సంఖ్య పెరిగిపోయి పారిశుద్ధ్యానికి విఘాతం కలిగిస్తున్నాయనే ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పందులను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ.. పెంపకందారులు పందులు బయట తిరగకుండా చూసుకోవాలని లేదంటే వాటిని దూర ప్రాంతాలకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తకుప్పలు తొలగించరూ..!

మియాపూర్: దీప్తిశ్రీనగర్ కాలనీలోని రేగులకుంట చెరువు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోయాయి. కాలనీ పక్కనే ఖాళీ ప్రదేశంలో చెత్త షిఫ్టింగ్ యార్డ్ ఉంది. అందులోకి వెళ్లే ఆటోలు, లారీలు అన్ని కాలనీ నుంచే ధర్మపురి ఆలయ రోడ్డు, రేగుల కుంట చెరువు పక్కనుంచే వెళ్తుంటాయి. అయితే కొందరు చెత్త ఆటో డ్రైవర్లు యార్డ్‌కు వెళ్లకుండా నిర్లక్ష్యంగా దారిలో చెరువు పక్కనే వేస్తుండడంతో చెత్త కుప్పలు పేరుకపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త చెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువు పక్కన పేరుకుపోయిన చెత్త

అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో వేగంగా నిర్మాణం

మణికొండ: రోబోటిక్ టెక్నాలజీతో అంతర్జాతీయ ప్రమాణాలతో భారతి సిమెంట్ కొత్తగా అల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ పేరుతో 5 స్టార్ గ్రేడ్ సిమెంట్‌ను విడుదల చేసిందని దీని ద్వారా వేగంగా నిర్మాణాలు పూర్తవుతాయని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్ అన్నారు. పుప్పాలగూడ శ్రీసాయి బాలాజీ స్టీల్, సిమెంట్ డీలర్ షాప్‌లో మేస్త్రీలకు సిమెంట్‌పై బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ నాణ్యతతో ఉంటుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, వంతెనలు, రహదారులకు ఈ సిమెంట్ వాడితే నిర్మాణాలు మరింత పటిష్టంగా ఉంటాయన్నారు. ఇతర సిమెంట్ కంటే ధరలో రూ. 20 మాత్రమే అదనంగా ఉన్నా పటిష్టతలో ప్రపంచ స్థాయిలో ఉంటుందన్నారు. డీలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ మధ్య ఎక్కువమంది భారతి అల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్ సిమెంట్‌నే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్ తరఫున రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



మేస్త్రీలకు అవగాహన కల్పించిన ఇంజినీర్

కూరగాయల పంటలపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా వర్షాధారిత కూరగాయల పంటల అభివృద్ధి జిల్లా ఉద్యానశాఖ ఇన్‌చార్జి సీహెచ్ పండరి రైతులకు అవగాహన కల్పించారు. సమగ్ర కూరగాయల పంటలతో పాటు తేనెటీగల పెంపకం, వర్మి కంపోస్ట్ ఎరువు తయారీ, మందారం వంటి అంశాలపై రైతులకు క్లుప్తంగా వివరించారు. తద్వారా మంచి లాభాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి అనూషరెడ్డి, ఏఈఓ అస్మిత, రైతులు పాల్గొన్నారు.




విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించాలి


రాయదుర్గం: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు అద్భుతమైన ప్రగతి సాధిస్తారని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి ఉత్సవాలను ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా 'ఎంపవరింగ్ స్టూడెంట్స్ టు బీ ఏజెంట్స్ ఆఫ్ చేంజ్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తును మార్చగల శక్తి విద్యార్థులకు మాత్రమే ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అశోక్ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం సాధించిన విజయాలను గుర్తించి ప్రపంచంలోని వివిధ యూనివర్సిటీలకు చెందిన 40 మంది డాక్టరేట్లతో పాటుగా భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారం భారతరత్నను 1997లోనే ఆయనకు ప్రదానం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్కీ పవర్ అండ్ ఎనర్జీ హెడ్ విద్యాసాగర్, కళాశాల చీఫ్ ఎస్ లక్ష్మీకాంతరావు, డాక్టర్ పి రాజారావు, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదాపూర్ జడ్పీ పాఠశాలలో..

మాదాపూర్: ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో మాదాపూర్ జడ్పీ పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌సీయూ మానవ వనరుల విభాగాధిపతి ఆచార్య ఎస్. సుధాకర్ బాబు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బసవలింగం, అధ్యాపకుడు మధుసూదన్‌రెడ్డి, నరోత్తమ రెడ్డి, చంద్రశేఖర్, మంగ, రోజమ్మ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొత్తపల్లి కోటేశ్వర్‌రావు, శివరామకృష్ణ, విష్ణుప్రసాద్, జనార్దన్, పాలం శ్రీను, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



'ఎస్కీ' క్యాంపస్‌లో అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు



మాదాపూర్ జడ్పీ పాఠశాలలో ఆచార్య సుధాకర్ బాబు తదితరులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462